కాంగ్రెస్ అంటేనే కరప్షన్ పార్టీ

- ఆడకుండానే ఓడిపోయిన బీజేపీ
- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి


ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఆర్మూర్: కాంగ్రెస్ అంటేనే కరప్షన్ పార్టీ అని, సీఎం కేసీఆర్ దెబ్బకు బీజేపీ ఎన్నికల గ్రౌండ్‌లో దిగి ఆడకుండానే ఓడిపోయిందని బీఆర్ఎస్ ఆర్మూర్ నియోజకవర్గ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆలూర్ రోడ్డులో ప్రజాఆశీర్వాద సభ నిర్వహించనున్న స్థలంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీతో సహా పలువురు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలను ఖండించారు. గాంధీభవన్ మెగామాల్‌లో టికెట్లు అమ్ముకునే బంపర్ ఆఫర్ స్కీము నడుస్తోందని ఎద్దేవా చేశారు. మరో జాతీయ పార్టీ అయిన బీజేపీ నార్ ఇండియా కంపెనీ అని అన్నారు. ఆ రెండు పార్టీలు దేశాన్ని దోచుకునే దోపిడీ కంపెనీలేనని విరుచుకుపడ్డారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఘోరపరాజయం తప్పదన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో బీజేపీకి అభ్యర్థులు కూడా దొరకడం లేదన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలంతా తనవైపే ఉన్నారని, 60వేల మెజారిటీతో హ్యాట్రిక్ సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, డాక్టర్ మధు శేఖర్, ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న కార్మికుల దీక్షలు



బోధన్: బకాయి వేతనాలు చెల్లించి తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఎన్డీఎస్ఎల్ ప్రధాన గేటు ఎదుట కార్మికుల రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం నాటికి దీక్షలు 90వ రోజుకు చేరాయి. కార్మికులు అర్షద్, షేక్ మొహినొద్దీన్ దీక్షా శిబిరంలో కూర్చున్నారు. ప్రైవేట్ యాజమాన్యం తమను పట్టించుకోవడం లేదని, ప్రభుత్వమైన కనికరించాలని వారు కోరారు. నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉచిత కరాటే శిక్షణ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో ఉన్న మహాలక్ష్మి ఆలయం ఆవరణలో ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు కరాటే మాస్టర్ సురేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మరక్షణ కోసం మహిళలకు ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు కరాటే శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పిల్లలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు



మాక్లూర్: మండలంలోని రాంచంద్రపల్లిలో మండల పశువైద్యాధికారి కిరణ్‌దేశ్‌పాండే ఆధ్వర్యంలో గురువారం గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మొత్తం ఇప్పటి వరకు 2వేల 375 గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాల వారీగా వేసే టీకాల కార్యక్రమం కొనసాగుతుందని, జీవాల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాండే సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యులు ఉమాసహేర్, సిబ్బంది వినిత, గంగాజమున, అహ్మద్‌పాషా, సుధీర్, గంగాధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ



బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లిలో ఐసీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు గురువారం వేప నూనె, కూరగాయల విత్తనాలతో పాటు పసుపులో తెగుళ్ల నివారణ కోసం మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విష్ణు మాట్లాడుతూ.. రైతులు ఐసీసీ ఫౌండేషన్ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సీఎఫ్ సాయికుమార్, రైతులు దిలీప్, రాజాసాబ్, అరుణ్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు..

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో కట్ట మనోహర్, లక్షిత దంపతులు తమ కూతురు మిథిలా పుట్టిన రోజును పురస్కరించుకొని గురువారం పంచాయతీ కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బియ్యం, పప్పు, వంట నూనె, చింతపండు, కారం తదితర వంట సామగ్రిని ఉప సర్పంచ్ రాజేశ్వర్ చేతుల మీదుగా అందజేశారు.

మూలకాల పెట్టె పుస్తకం ఆవిష్కరణ



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ ఉన్నత పాఠశాలలో వేల్పూర్‌కు చెందిన తంగుడిగె శ్రీనివాస్‌రావు రచించిన మూలకాలపెట్టె పుస్తకాన్ని పీఆర్టీయూ నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత మాట్లాడుతూ.. విజ్ఞానశాస్త్రాన్ని తెలుగు భాషకు అనుసంధానం చేస్తూ ఆటవెలది పద్య రూపంలో విద్యార్థులకు వినూత్న రీతిలో పాఠ్యాంశాలపై అమితాసక్తిని పెంపొందించడానికి ప్రయోగాత్మకంగా ఈ పుస్తకం ఉపయోగపడుతుందన్నారు. పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి కమలాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రాంమోహన్, మల్లీశ్వరి, రాజేశ్వరి, రఘునాథ్, పోశన్న, రవీందర్, శ్రీనివాస్, జనార్దన్, లింగ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సంబురాలు

రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా యెండల లక్ష్మీ నారాయణను పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో గురువారం సాయంత్రం రుద్రూర్‌లో ఆ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బాన్సువాడ గడ్డపై బీజేపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎముల గజేందర్, నాయకులు బైండ్ల బాల్‌రాజ్, సాయినాథ్, వినోద్‌కుమార్, కృష్ణం రాజు, గంగాధర్, తోట శంకర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని స్పష్టమైన హామీ ఇవ్వాలి

- 30ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ ఉద్యమం కొనసాగుతోంది
- మంద కృష్ణ మాదిగ


మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

నందిపేట్ (ఆర్మూర్): ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. నందిపేట్ మండల కేంద్రంలో మాదిగల విశ్వరూప బహిరంగ సభ సన్నాహక సదస్సును గురువారం ఎమ్మార్పీఎస్ ఆర్మూర్ ఇన్‌చార్జి సరికెల పోశెట్టి మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా మాదిగల భవిష్యత్తు కోసం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమం కొనసాగుతున్నదని, ప్రస్తుతం ఉద్యమం చివరి మెట్టుమీద ఉందన్నారు. ఈ నెల 11న హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్ లో లక్షలాది మంది మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలతో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బహిరంగ సభకు ప్రధాని మోదీ హాజరవుతారని, తనకు నాలుగు గోడల మధ్య ఇచ్చిన హామీని విశ్వరూప బహిరంగ సభలో లక్షలాది మాదిగల మధ్య ఇవ్వాలని ప్రధానిని కోరినట్లు ఆయన తెలిపారు. అన్ని సమస్యల మీద ఢిల్లీ వెళ్లి మాట్లాడుతున్న కేసీఆర్.. 30 ఏళ్లలో ఎస్సీ వర్గీకరణ విషయంలో మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. సదస్సులో బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మంద ప్రభాకర్ మాదిగ, నందిపేట్ మండలం అధ్యక్షుడు జంగం సాయికుమార్, సీనియర్ నాయకులు మంతెన మల్లయ్య మాదిగ, అంకంపల్లి సుభాష్ మాదిగ, ఆర్మూర్ రూరల్ అధ్యక్షుడు మంగళరామ్ ముత్తెన్న మాదిగ, డొంకేశ్వర్ మండలం ముప్పైన గంగారాం తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లకు ఏర్పాట్లు



ఆర్మూర్‌టౌన్/బోధన్‌టౌన్: నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్మూర్, బోధన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వినోద్‌కుమార్, రాజాగౌడ్ తెలిపారు. ఈ మేరకు గురువారం వారు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. నామినేషన్ల కేంద్రం నుంచి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థితోపాటు కేవలం నలుగురు వ్యక్తులకు అనుమతి ఉంటుందని, అభ్యర్థుల సౌకర్యార్థం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సహాయ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 నుంచి 3గంటల వరకు నామినేషన్ దాఖలు చేయొచ్చన్నారు. వారివెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రాజకీయ పార్టీల్లో చేరికలు

ఆర్మూర్: పట్టణానికి చెందిన క్షత్రియ సమాజ్ సెక్రటరీ బారడ్ గంగామోహన్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. కౌన్సిలర్లు గంగామోహన్ చక్రు, హన్మంతు, నాయకులు సంజయ్ సింగ్ బబ్లూ, పూజ నరేందర్, లింగాగౌడ్, పండిత్ పవన్ తదితరులు ఉన్నారు.

వేల్పూర్ మాజీ జెడ్పీటీసీ..

వేల్పూర్: వేల్పూర్ మాజీ జెడ్పీటీసీ పాశపు రాజేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. వేల్పూర్‌లో ఆయనకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, సంజీవరెడ్డి, మార గంగారెడ్డి, కోటపాటి నర్సింహానాయుడు, రాజారాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్ విండో మాజీ చైర్మన్..

రుద్రూర్: రుద్రూర్ సింగిల్ విండో డైరెక్టర్ డి సుదర్శన్, విండో మాజీ చైర్మన్ ఎంపీ గంగారాం పోచారం సురేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కోటగిరి మండలం ఎత్తొండకు చెందిన వెలమ సంఘం సభ్యులు, మండల కేంద్రానికి చెందిన దేవాంగ సంఘం సభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

బీజేపీలో..

కమ్మర్‌పల్లి: మండలం చౌట్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకుడు నిరంజన్‌తోపాటు పలువురు నాయకులు, భీమ్‌గల్ మండలం బాచన్‌పల్లికి చెందిన యువకులు గురువారం బీజేపీలో చేరారు. చౌట్‌పల్లిలో బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిరంజన్‌కు బీజేవైఎం మండలాధ్యక్షుడిగా నియామకపత్రాన్ని అందజేశారు.

కాంగ్రెస్‌లో..

బాల్కొండ: ఉమ్మడి బాల్కొండ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోచేరారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కోనాపూర్ వడ్డెర కాలనీకి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా.. సునీల్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీలో చేరిన వారికి సునీల్‌రెడ్డి సూచించారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తాం

- బీజేపీ బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి


బోధన్‌లో మాట్లాడుతున్న వడ్డి మోహన్‌రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపుతామని బోధన్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. బోధన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోధన్ అభ్యర్థిగా తన పేరును పార్టీ ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. తనకు టికెట్ రావడానికి సహకరించిన ఎంపీ ధర్మపురి అర్వింద్, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, బాన్సువాడ ప్రభారి నర్సింహారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. బోధన్ నియోజక వర్గంలో కాంగ్రెస్‌కు మూడుసార్లు, బీఆర్ఎస్‌కు రెండుసార్లు అవకాశం ఇచ్చినప్పటికీ, వారు చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఏడాది కాలంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో, పట్టణంలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నామన్నారు. నిజాం షుగర్స్‌ను తెరిపించాలంటే బీజేపీకి ఓటు వేయాలని, రాష్ట్రంలో, కేంద్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే ఫ్యాక్టరీకి పునర్వైభవం తీసుకువస్తామని అన్నారు. నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, వారు కోరుకునే మార్పు బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు బాలరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్, జిల్లా కార్యదర్శి సుధాకర్‌చారి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్, బీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు గుంత గంగాధర్, మాజీ కౌన్సిలర్ ధర్మపురి, మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవితాల్లో ఎన్నోమార్పులు తీసుకువచ్చి జీవన ప్రమాణ స్థాయిని పెంచిన కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేద్దామన్నారు. చిన్న రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఉంటేనే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, ప్రజల సమస్యల పరిష్కారమవుతాయన్నారు. బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకువచ్చి మంచి ఫిట్‌మెంట్‌తో వేతనాలు సాధిద్దామన్నారు. సమావేశంలో పీఆర్టీయూ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, జ్ఞానేశ్వర్, రాజేశ్వర్‌రెడ్డి, రాంరెడ్డి, గంగారాం, సుధాకర్, కోటేశ్వర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలి

- నిజాంషుగర్స్‌ను తెరిపిస్తాం
- కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి


హున్సాలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

బోధన్: ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన బీఆర్ఎస్‌కు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. తాము అధికారంలోకి రాగానే సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీములను అమలు చేస్తామన్నారు. సాలూర మండలం ఖాజాపూర్, హున్సా, మందర్న గ్రామాల్లో సుదర్శన్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. హున్సా గ్రామబస్టాండ్ ప్రాంతంలో ఆయన మాట్లాడుతూ.. మందర్న, హున్సా గ్రామాల్లో ప్రభుత్వ భూమిని సాగు చేసుకుని పట్టాలు రాక ఇబ్బందుల పడుతున్న పేదలకు అధికారంలోకి రాగానే పట్టాలు ఇస్తామని భరోసా ఇచ్చారు. మందర్న, హున్సాకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరగా, సుదర్శన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి, మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు అల్లె లావణ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మందర్న రవి, జిల్లా నాయకులు తాహెర్‌బిన్ హందాన్, గంగాశంకర్, నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ చీల శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠానాకలాన్‌లో సీనియర్ నాయకుడు గణపతిరెడ్డి సతీమణి లక్ష్మి ప్రమాదవశాత్తు మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. లక్ష్మి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజల చూపు బీజేపీ వైపు

బోధన్‌టౌన్(బోధన్): ప్రజల చూపు బీజేపీ వైపు ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 30, 31 వార్డుల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రచారం చేశారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని, బీసీలను కాంగ్రెస్, బీఆర్ఎస్ విస్మరించాయని విమర్శించారు. ఆ పార్టీలకు బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలిపిస్తే పేదలకు ఇండ్లు నిర్మిస్తా


ప్రచారంలో మాట్లాడుతున్న పైడి రాకేశ్‌రెడ్డి

మాక్లూర్: తనను గెలిపిస్తే ఇండ్లు లేని పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇస్తానని ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని వేణుకిసాన్‌నగర్, గాలిబ్ నగర్, గంగరమంద, రాంపూర్ గ్రామాల్లో రాకేశ్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలుపొందిన సంవత్సరం లోగా ఇండ్లు లేని పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తనదేనన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టు కోకపోతే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఓటర్లకు భరోసా ఇచ్చారు. రెండుసార్లు గెలుపొందిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో పేదలెందరో పూరి గుడిసెల్లో నివాసముండటం విచారకరమన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తప్ప ఇతరులెవరూ అభివృద్ధి చెందలేదన్నారు. రానున్న ఎన్నికల్లో పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు గంగోనే సంతోష్, సురేశ్‌నాయక్, వినోద్, రమేశ్, రాజు పాల్గొన్నారు.

బోధన్ గులాబీలో 'యువ జోష్'



యువగర్జన సభలో ప్రసంగిస్తున్న షకీల్

బోధన్: ఎమ్మెల్యే షకీల్, బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో గురువారం రాత్రి బోధన్‌లోని శక్కర్‌నగర్ మైదానంలో నిర్వహించిన బీఆర్ఎస్ మహా యువగర్జన సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. నియోజకవర్గం పరిధిలోని బోధన్ అర్బన్, రూరల్, ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల నుంచి పార్టీ యువజన విభాగం కార్యకర్తలు, యువకులు వేలాదిగా తరలివచ్చారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్ యువతను ఉద్దేశించి చేసిన ప్రసంగాలు ఉత్సాహాన్ని నింపాయి. షకీల్‌ను 50 వేల మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత యువతపై ఉందని కవిత అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేశానని, కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచానని ఎమ్మెల్యే షకీల్ అన్నారు. చేసిన అభివృద్ధిని చూసి తనను మళ్లీ గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ కవితకు ఎమ్మెల్యే షకీల్, ఆయనసతీమణి ఆయేషా ఫాతిమా, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనస్వాగతం పలికారు. కవిత, షకీల్‌ను గజమాలతో పార్టీ యువజన విభాగం నాయకులు సన్మానించారు.

హుషారెత్తించిన మిట్టపల్లి సురేందర్

రచయిత, గాయకుడు మిట్టపల్లి సురేందర్‌తోపాటు ఆయన బృందం సభ్యులు తమ ఆటపాటలతో యువతలో హుషారెత్తించారు. ఎమ్మెల్యే షకీల్ కళాకారులు, నాయకులతో కలిసి డ్యాన్స్ చేశారు. సభకు హాజరైన యువకులు సైతం స్టెప్పులు వేశారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితయాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ సోహెల్, ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రవీంద్రయాదవ్, ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఇండ్లు కాంగ్రెస్‌తోనే సాధ్యం

- అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ
- ఆర్మూర్ కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి


ప్రజలకు అభివాదం చేస్తున్న వినయ్‌రెడ్డి

మాక్లూర్/పెర్కిట్(ఆర్మూర్): పేదలందరికీ ఇండ్లు నిర్మించివ్వడం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి అన్నారు. మాక్లూర్ మండలం గుత్ప, గుత్పతండా, ఆలూర్ మండలం ఇస్సాపల్లి, మిర్దాపల్లి, రాంపూర్, దేగాం గ్రామాల్లో వినయ్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని, తాము అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. గుత్ప గ్రామానికి చెందిన ఒకరిని ఇల్లు నిర్మిస్తానని వెంట తిప్పుకున్న ఎమ్మెల్యే.. ఉన్న ఇంటిని పడగొట్టించడంతో సదరు వ్యక్తి మతిస్థిమితం కోల్పోయాడన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం చేస్తుండగానే బాధితుడు గుడి పైనుంచి దూకి ఆత్మహత్యా యత్నం చేశాడన్నారు. ఇంతటి మోసకారి ఎమ్మెల్యేకు రానున్న రోజుల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని వినయ్‌రెడ్డి పిలుపునిచ్చారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఆర్మూర్ ప్రాంతాన్ని కాంగ్రెస్ సస్యశ్యామలం చేసిందన్నారు. రాంపూర్, మిర్దాపల్లి, ఇస్సాపల్లి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా, వినయ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మార చంద్రమోహన్, యాల్ల సాయారెడ్డి, కోల వెంకటేశ్, పుట్టింటి శ్రీనివాస్‌రెడ్డి, దూదిగాం ప్రమోద్, విట్టం జీవ, సాయిబాబాగౌడ్, చిన్నారెడ్డి, ముక్కెర విజయ్, మధు, శంకర్, శ్రీనివాస్, మల్లారెడ్డి, మాక్లూర్ మండల సీనియర్ నాయకులు డేగ పోశెట్టి, గంగాధర్‌గౌడ్, రవిప్రకాశ్, జైల్ సింగ్, కరిపె రాజేశ్వర్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి బి ధర్మనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేల్పూర్‌కు బీఆర్ఎస్ శ్రేణులు

బాల్కొండ: ప్రజాఆశీర్వాద సభలో పాల్గొనేందుకు ఉమ్మడి బాల్కొండ మండలం నుంచి గురువారం వేల్పూర్‌కు బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లాయి. బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తుందని నాయకులు అన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – టైగర్‌నాగేశ్వరరావు- 12.40, 7.05
నరకాసుర (తెలుగు) - 4.05
భగవంత్ కేసరి (తెలుగు) - 10.30

స్క్రీన్-2 – మా ఊరి పొలిమేర-2 (తెలుగు) - 10.25, 1.15, 7.30, 10.20
లియో (తెలుగు) - 4.05

స్క్రీన్-3 – కీడాకోలా - 11.20, 2.00,4.40,7.20, 10.00

స్క్రీన్-4 – భగవంత్‌కేసరి(తెలుగు)-12.45,6.35
విధి (తెలుగు)-4.10
లియో (తెలుగు) - 10.00

సంచారజాతుల అభివృద్ధికి ప్రత్యేక కృషి

నవీపేట(బోధన్): సంచార జాతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని కేంద్ర సంచార జాతుల అభివృద్ధి , సంక్షేమ బోర్డు సభ్యుడు ప్రవీణ్ శివాజీరావు గుగే అన్నారు. మండల కేంద్రంలోని డీఎన్‌టీ జిల్లా అధ్యక్షుడు జాదవ్ శరత్ నివాసానికి గురువారం వెళ్లిన ఆయన తేనీటి విందులో పాల్గొన్నారు. అనంతరం కమ్యూనిటీ భవనంలో ఓడ్, కైకాడి, మందుల, జోషి నందివాలా, వంజరి, మేదర, గోత్రాల,వడ్డెర, పెద్దమ్మలవారు, గిసాడి సంచార కులాల ప్రతినిధుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్య, నివాస సమస్యలతోపాటు కులాలను తిట్టు పదాలుగా ఉపయోగిస్తూ అవమానిస్తున్నారని, రక్షణ కరువైన నేపథ్యంలో అట్రాసిటీ కేసు నమోదు చేసేలా సిఫారసు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా ప్రవీణ్ శివాజీరావు గుగే మాట్లాడుతూ.. సంచారజాతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసేలా కేంద్ర ప్రభుత్వం ద్వారా సిఫారసు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం సంచార జాతుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించిందని, ఇందులో భాగంగానే సంచారజాతుల అభివృద్ధి, డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసి ప్రత్యేక పథకాలు ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. అనంతరం సంచార జాతుల భాష అంతరించిపోతున్న వైనంపై మందుల కులస్తులు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం డీఎన్టీ జిల్లా అధ్యక్షుడు జాదవ్ శరత్ వారిని సన్మానించారు.